## క్లుప్తంగా

### అవార్డు గ్రహీతకు సన్మానం



చంద్రమౌళిని సన్మానించిన ఎమ్మెల్యే కసిరెడ్డి

**ఆమనగల్లు:** కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డు పొందిన చేనేత కళాకారుడు చంద్రమౌళిని పట్టణంలోని ఓ గార్డెన్‌లో మంగళవారం ఎమెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీసీబీ మాజీ సభ్యుడు బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కిషన్‌రెడ్డి, వైస్ చైర్మన్ కేశవులు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, విజయ డెయిరీ మాద్గుల చైర్మన్ సాయిరెడ్డి, పద్మశాలీ సంఘం మాద్గుల అధ్యక్షుడు అశోక్, నాయకులు కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విష్ణు, పాండుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### స్కూల్ కిట్స్ పంపిణీ



దాతలు అందజేసిన కిట్లతో చిన్నారులు తదితరులు

**ఆమనగల్లు:** ఆమనగల్లు మండలం చెన్నకేశవ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం నగరానికి చెందిన అసెన్సిస్ సాఫ్ట్‌వేర్ కంపెనీ సహకారంతో మానవతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా స్కూల్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మానవతా ఫౌండర్ డా.రమ్య.. చిన్నారులతో మాట్లాడి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసన్సిస్ సంస్థ డైరెక్టర్ అర్పిత్, వైది, గగన్, మానవతా సభ్యులు సందీప్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### ఆలయాల నిర్మాణంతో ఆధ్యాత్మిక శోభ



విరాళం అందజేస్తున్న పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

**కడ్తాల్:** ఆలయాల నిర్మాణంతో గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ విరాజిల్లుతుందని, భక్తి భావం పెంపొందుతుందని పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల పరిధి కాస్లుబావితండాలో నిర్మిస్తున్న తుల్జాభవాని ఆలయానికి రూ.50 వేల విరాళాన్ని ఆయన మంగళవారం ఆలయ నిర్వాహకులకు అందజేశారు. దేవాలయాల నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం నిర్వాహకులు దాతను సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యా నాయక్, మాజీ ఉప సర్పంచ్ పాండునాయక్, నాయకులు బీచ్యానాయక్, హీరాసింగ్, తులసీరాం, శ్రీను, లక్ష్మన్, వినోద్, రమేశ్, రతన్, రాజేశ్, వంశీ, మహేశ్, వెంకటేశ్, శ్రీకాంత్, రాజునాయక్, శ్రీను ఉన్నారు.

### ప్రతిభావంతులకు 'విద్యాజ్యోతి'

**ఇబ్రహీంపట్నం:** ప్రతిభగల విద్యార్థులకు కెనరా బ్యాంక్ విద్యాజ్యోతి స్కాలర్ షిప్ అందజేస్తుందని ఇబ్రహీంపట్నం ఆ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ వరకుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం, కోహెడ, ఆదిబట్ల, మన్నెగూడ, గుమ్మడవెల్లి ప్రభుత్వ పాఠశాలల్లో 5 నుంచి 10వ తరగతి విద్యనభ్యసిస్తున్న వారిలో ప్రతిభ చూపిన వారికి నగదు ప్రోత్సాహకాలను అందజేస్తామని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం ఉన్నత పాఠశాలలో గురువారం 11 గంటలకు డిప్యూటీ జనరల్ మేనేజర్ వై.సీహెచ్ వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ మేనేజర్ అక్షయ్ మూర్తి, జిల్లా రిజినల్ ఆఫీసర్ పావని తదితరులు హాజరుకానున్నారని చెప్పారు.

### సీతాఫలాల సేకరణకు టెండర్

**కడ్తాల్:** ఆమనగల్లు ఫారెస్ట్ డివిజన్ పరిధి కడ్తాల్ యూనిట్‌లో సీతాఫలాల సేకరణకు మంగళవారం అటవీశాఖ అధికారులు బహిరంగ వేలంపాట నిర్వహించారు. రూ.32 వేలు కనిష్ఠ ధర నిర్ణయించగా.. వేలంలో నలుగురు పాల్గొన్నారు. కె.విజయ్‌కుమార్ రూ.1.6 లక్షలకు హక్కులను సొంతం చేసుకున్నారు. ఈ యూనిట్‌లో యాచారం, మహేశ్వరం మండలంలోని కొంత భాగం, కందుకూరు, కడ్తాల్ పరిసర ప్రాంతాలున్నాయని అటవీశాఖ అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆమనగల్లు ఫారెస్ట్ డివిజనల్ అధికారి వేణుమాధవ్‌రావు, ఫారెస్ట్ రేంజ్ అధికారి వెంకటయ్యగౌడ్, కడ్తాల్ ఫారెస్ట్ సెక్షన్ అధికారి ఎండీ హుస్సేన్, బీట్ అధికారి యాదగిరి, సిబ్బంది ఉన్నారు.

# చెత్త కదలదు.. మురుగు పారదు

పేరుగొప్ప మండలం యాచారం.
మండల కేంద్రంలో పారిశుద్ధ్యం లోపించి ఎక్కడికక్కడ చెత్త కుప్పలు పేరుకుపోయాయి. మురుగు కాల్వల్లో చెత్తాచెదారం నిండి, అవి ముందుకు సాగని దుస్థితి. కదలని చెత్త, పారని మురుగుతో దోమలు, ఈగలు విజృంభించి, ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

- మాల్‌లో లోపించిన పారిశుద్ధ్య పనులు
- తీవ్ర దుర్వాసన.. దోమల విజృంభన
- ఆందోళన వ్యక్తంచేస్తున్న ప్రజలు



యాచారం గ్రామంలో పేరుకుపోయిన చెత్త



నందివనపర్తి రోడ్డుపై డ్రైనేజీ

**యాచారం:** పల్లెల్లో పాలన పడకేసింది. పారిశుద్ధ్య పనులు లోపించాయి. వీధులు, రహదారులకు ఇరువైపులా అపరిశుభ్రత వాతావరణ నెలకొంది. మండల కేంద్రంలోని నందివనపర్తి గ్రామం వెళ్లే దారిలో డ్రైనేజీ కాల్వలు నిండి, మురుగంతా రోడ్డు పైనే ప్రవహిస్తోంది. మాంసాహార వ్యాపారులు.. వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పారబోస్తుండటంతో తీవ్ర దుర్వాస వస్తోంది. సాగర్ హైవే పక్కనే పది అడుగుల దూరంలోనే చెత్త కుప్పలు దర్శమిస్తున్నాయి. వ్యర్థాల కుప్పల వద్ద పందులు, కుక్కలు గుంపులుగా సంచరిస్తున్నాయి. రహదారిపై రాకపోకలు సాగించే వారిపై అకారణంగా దాడులకు పాల్పడుతున్నాయి.

**సమస్యలు పట్టని అధికారులు**

మండల కేంద్రంలోని పలు కాలనీల్లో సీసీరోడ్లు, డ్రైనేజీ కాల్వల సమస్యలకు పరిష్కారం మార్గం చూపాలని ప్రజలు కోరుతున్నారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సుమారు రూ.కోటికి పైగా నిధులు మంజూరు చేయడంతో ఎస్‌బీఐ ఎదుట కాలనీల్లో డ్రైనేజీ కాల్వల సమస్య తీరింది. అదే కాలనీల్లో సీసీ రోడ్ల కోసం రూ.కోటిన్నరకు పైగా టీజీఐఐసీ ఫండ్ మంజూరుకు ప్రతిపాదనలు పంపారు. గ్రామ పంచాయతీ వెనకాల కాలనీలో దాదాపు రూ.రెండున్నర కోట్లకు పైగా నిధులు కేటాయిస్తే సమస్యలు గట్టెక్కనున్నాయని అధికారులు గుర్తించారు. ఇదిలా ఉండగా.. పేరుకే మండల కేంద్రమని, కనీస సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నామని పలువురు పేర్కొంటున్నారు. ఇంటి పన్నుల వసూలుకు చొరవ చూపే అధికారులు.. ప్రజా సమస్యల గురించి పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అసలే సీజనల్ వ్యాధుల కాలం. ఆపై అపరిశుభ్రతతో ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు.

> **చర్యలు చేపడతాం**
>
> 
>
> వానలు పడుతున్న కారణంగా పారిశుద్ధ్య పనులకు ఆటంకం కలుగుతోంది. యాచారం గ్రామంలోని పలు కాలనీల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. మురుగు కాల్వలు తీసే వరకు ఇంకుడు గుంతలు తీసుకోవాలని కోరినా.. గ్రామస్తులు కొందరు స్పందించడం లేదు. ఫలితంగా రోడ్డుపై డ్రైనేజీ పారి.. దుర్వాసన వస్తోంది.
>
> – తిరుపతయ్య, పంచాయతీ కార్యదర్శి, యాచారం

# ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

- ఏడాది కాలంలోనే రూ.600 కోట్లతో అభివృద్ధి పనులు
- సాగర్ రహదారి విస్తరణకు కృషి
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

**యాచారం:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మండల పరిధి యాచారం, నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్ గ్రామాల్లో మంగళవారం రూ.9 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మరో రూ.50 లక్షలతో యాచారం సీహెచ్‌సీలో మరమ్మతుల పనులు ప్రారంభించారు. ప్రజలకు 24 గంటల పాటు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. మరో కార్యక్రమంలో పలువురు అర్హులకు రేషన్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఒక్క ఏడాదిలోనే నియోజకవర్గంలో రూ.600 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో 10 వేల ఎకరాలకు పైగా భూములను ఫార్మాకు ఇచ్చామని, దాంతోనే మండలంలోని 24 గ్రామాల్లో సీసీరోడ్లు, ఇతర అభివద్ధి పనులకు రూ.50 కోట్లకు పైగా టీజీఐఐసీ నుంచి ప్రత్యేక నిధులు మంజూరు చేయించామని వివరించారు. సాగర్ రోడ్డును హైవేగా నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్ ఫార్మా భూ బాధితులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.

**ఆర్థిక ప్రగతి సాధించండి**

వ్యాపార కేంద్రమైన మాల్‌లో నూతన డీసీసీబీ బ్రాంచ్‌ను డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్యతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ బ్రాంచ్‌లో అన్ని రకాల ఆర్థిక సేవలు పొందవచ్చని తెలిపారు. చైర్మన్ సత్తయ్య మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సహకారంతో ఆదిబట్లలో డీసీసీబీ భవనాన్ని సకల సౌకర్యాలతో నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. కొత్తగా పీఏసీఎస్‌ను ఏర్పాటు చేస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకుని, ఆర్థిక ప్రగతి సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి మాధవరావు, తహసీల్దార్ అయ్యప్ప, ఎంపీడీఓ రాధారాణి, పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్ రెడ్డి, సీఈఓ నాగరాజు, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపీపీలు రామకృష్ణ, రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహ, నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్, చంద్రశేఖర్ రెడ్డి, అమృతాసాగర్, కవిత తదితరులు పాల్గొన్నారు.



డీసీసీబీ బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు

# సర్వేచేసి.. సమస్యకు పరిష్కారం దిశగా..

- భూ పరిశీలనకు కదిలిన రెవెన్యూ యంత్రాంగం
- వివాదాస్పద భూములపై దృష్టి



భూ పరిశీలనలో రైతులతో మాట్లాడుతున్న రెవెన్యూ సిబ్బంది

**ఇబ్రహీంపట్నం:** దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ యంత్రాంగం కదిలింది. మండలానికి ట్రైనీ లైసెన్సుడ్ సర్వేయర్లను 20 మందిని కేటాయించారు. 45 రోజుల పాటు వీరు పనిచేయనున్నారు. వివాదాస్పద భూముల సర్వే చేసి, రైతులకు న్యాయం చేయనున్నారు. పలు సర్వే నంబర్లలోని రికార్డుల్లో తక్కువ భూమి, సర్టిఫికెట్లు, పాసు బుక్కుల్లో ఎక్కువ భూమి చూపుతుండటంతో సమస్యలు ఉత్పన్నం అవుతున్న నేపథ్యంలో.. సర్వే చేసి, నాటి అసైండ్ భూ పత్రాలు, పాసు బుక్కులను పరిశీలించి సమస్య తీర్చనున్నారు. ఉప్పరిగూడ, సీవీఆర్, భారత్ కళాశాల సమీపంలోని( వెనుక) ఉన్న 1146 సర్వే నంబర్‌లో ప్రభుత్వం అసైండ్ చేసిన భూమిలో రికార్డు కంటే అదనంగా 27 ఎకరాల 3 గుంటలు వస్తోంది. దీంతో సర్వేయర్లు ఈ భూమిని మంగళవారం సర్వే చేయగా 138 ఎకరాల 4 గుంటలు తేలింది. సుమారు 80 మంది రైతులు ఈ సమస్యను పరిష్కరించాలని రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకోగా.. ఆ దిశగా రెవెన్యూ యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. దీంతో రైతుల ఇబ్బందులు తొలగనున్నాయి. ఈ సర్వేలో తహసీల్దార్ సునితారెడ్డి, డీటీ శ్రీనివాస్‌గౌడ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సువర్ణ, సర్వేయర్ సాయికృష్ణారెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు వీరన్న, విష్ణు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**తుర్కయంజాల్:** ఇంజాపూర్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా బుధవారం పలు చోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏఈ రాములు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ తొర్రూర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు ఎంఆర్ఆర్ కాలనీ, కుర్మబస్తీ, ఎస్సీ బస్తీ, రేణుకా రెసిడెన్సీ, సైబర్ సిటీ, శ్రీగణేశ్ నగర్, తొర్రూర్ గ్రామం, రాజీవ్ గృహకల్ప, స్కూప్స్ ఐస్‌క్రీమ్ ఏరియాలో సరఫరాకు అంతరాయం కలగనుందని ఏఈ పేర్కొన్నారు. అదే విధంగా బాలాజీ నగర్ పరిధిలో.. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు బాలాజీనగర్, బ్రాహ్మణపల్లి, శివశక్తినగర్‌లో ఆటంకం కలగనుందన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

### మహాసభలను జయప్రదం చేయండి

**ఇబ్రహీంపట్నం/మంచాల:** ఈ నెల 19 నుంచి 22వ వరకు మేడ్చల్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి బాలయ్య పిలుపునిచ్చారు. మంగళవారం మంచాల మండల పరిధి జాపాల గ్రామంలో మహాసభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. 4వ మహాసభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నర్ల శ్రీశైలం, గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షుడు రాజు నాయక్, మహిళా సంఘం నాయకురాలు నీలమ్మ పాల్గొన్నారు.

**ఇబ్రహీంపట్నంలో..**

మేడ్చల్ జిల్లా గాజుల రామారం మహారాజా గార్డెన్‌లో నిర్వహించే సీపీఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నేతలు అన్నారు.



ఇబ్రహీంపట్నం: వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన సీపీఐ నాయకులు

మంగళవారం ఇబ్రహీంపట్నంలో వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కావలి సురేష్, నర్సింహ్మ, నీలమ్మ, లక్ష్మయ్య, యాదయ్య, జె.నర్సింహ్మ, ప్రవీణ్, విప్లవ్, అన్వర్, బి. నర్సింహ్మ, జగదీశ్, సతీష్‌లు తదితరులు పాల్గొన్నారు.

### అరెస్టులు అప్రజాస్వామికం



మోదీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

**ఆమనగల్లు:** రాహుల్ గాంధీని అరెస్టు చేయడం అప్రజాస్వామికమని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్ అన్నారు. బీహార్‌లో ఓట్ల తొలగింపునకు వ్యతిరేకంగా ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఢిల్లీలో నిరసన వ్యక్తం చేసిన ఎంపీలను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ.. మంగళవారం ఆమనగల్లు పట్టణంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ర్యాలీ తీశారు. హైదరాబాద్- శ్రీశైలం రహదారిపై ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. అరెస్టులకు భయపడే వ్యక్తి రాహుల్‌గాంధీ కాదని, ఆయన ఆరోపణలకు ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీశైలం, పార్టీ మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్య, మాజీ ఎంపీపీ ధనుంజయ, నాయకులు వెంకట్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి, సురేశ్, అలీం, కృష్ణ తదితరులు ఉన్నారు.

### పర్యావరణాన్ని పరిరక్షించాలి



కళాశాల ఆవరణలో మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్ రాధిక

**ఇబ్రహీంపట్నం:** మొక్కలు పెంచి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ప్రిన్సిపాల్ రాధిక అన్నారు. ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం, మేరా యువభారత్‌ల సంయుక్త ఆధ్వర్యంలో 'అమ్మ కొరకు ఒక చెట్టు నాటుదాం' అనే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వ్యక్తిత్వ పోటీలను నిర్వహించి, ప్రతిభ చూపిన వారికి ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేశారు. యువభారత్ యువజన అధికారి ఐసయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డా.చింతల రాకేశ్ భవాని, అధ్యాపకులు రమేష్, సురేష్, నరేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.

### న్యాయవాదులకు క్రీడాపోటీలు

**ఆమనగల్లు:** ఆమనగల్లు పట్టణం బార్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు వివిధ క్రీడాపోటీలు నిర్వహించారు. పోటీలను అసోసియేషన్ అధ్యక్షుడు యాదీలాల్‌తో కలిసి జడ్జి స్వరూప ప్రారంభించారు. అనంతరం చెస్, క్యారం పోటీలు నిర్వహించారు. సీనియర్ న్యాయవాది లక్ష్మణశర్మ, అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు జగన్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు యాదవ్, కోశాధికారి కృష్ణ, సభ్యులు జానకీరాం యాదవ్, మల్లేశ్, గణేశ్ ఉన్నారు.

### మైసమ్మకు బోనాలు

**ఇబ్రహీంపట్నం:** ఇబ్రహీంపట్నం ప్రభుత్వాసుపత్రిలో నెలకొన్న ఉప్పల మైసమ్మకు మంగళవారం భక్తులు బోనం ఎత్తారు. ల్యాబ్ టెక్నీషియన్ రఘు.. దేవాలయాన్ని పెద్దగా పునర్నిర్మించారు. ఈ నేపథ్యంలో అమ్మవారికి నైవేద్యంగా బోనం, తొట్టెలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, వైద్యులు జవహర్‌నాయక్, కీర్తన, టెక్నీషియన్ రఘు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నెత్తిన బోనంతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

# పార్టీ బలోపేతానికి కృషి చేయండి

- బీజేపీ మండల అధ్యక్షుడు సాయి
- నూతన కార్యవర్గం ఎన్నిక

**అబ్దుల్లాపూర్‌మెట్:** కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు సాయికిరణ్‌గౌడ్ అన్నారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలుపించుకుందామన్నారు. మంగళవారం పార్టీ మండల కార్యాలయంలో నిర్వహించిన నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో కాషాయం జెండా ఎగుర వేద్దామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పార్టీ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శులుగా నవీన్‌కుమార్, వెంకటేశ్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా సురేఖ, ప్రకాష్ గౌడ్, సురేష్ ముదిరాజ్, రమేష్ గౌడ్, కార్యదర్శులుగా ప్రకాష్ చారి, పద్మ, మల్లేశం, మనోహర, శ్రీనివాస్, అనంతరెడ్డి, కోశాధికారిగా సుధాకర్ గౌడ్‌లను నియమించారు. అనంతరం నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు పాపయ్య గౌడ్, గోవర్ధన్ గౌడ్, రమాదేవి, రంగ జంగమయ్య, కొండల్ రెడ్డి, వీరస్వామి, శ్రావణ్ చారి, సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గానికి నియామక పత్రాలు అందజేస్తున్న పార్టీ నేతలు

### కార్మిక చట్టాల నిర్వీర్యానికి కుట్ర




అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

**ఇబ్రహీంపట్నం రూరల్:** కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తే సహించేది లేదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. మంగళవారం అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన 12 ఏళ్ల కాలంలో 4 కనీస వేతన సలహా మండళ్లు చేసిన సూచనలు ప్రభుత్వాలు విస్మరించాయని ఆరోపించారు. కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందని అనుమానం వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యురాలు స్వప్న, నాయకులు ఎల్లేష్, నర్సింహ పాల్గొన్నారు.

# అధిక దిగుబడికి ఆధునిక పద్ధతి మేలు

- సాగు విధానంలో మార్పులు అవసరం
- వ్యవసాయ శాస్త్రవేత్తలు



పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

**మంచాల:** తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి పొందాలంటే.. సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో పంటల సాగు- ఆధునిక పద్ధతుల అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్ర వేత్తలు మాట్లాడుతూ.. వానాకాలం పంటల సాగులో వచ్చే ఇబ్బందులను ముందుగా గుర్తించి, నష్ట నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. వేసవి కాలంలో తక్కువ నీటి వినియోగంతో.. ఎక్కువ విస్తీర్ణంలో సాగు మెలకువలు నేర్చుకోవాలని చెప్పారు. కూలీల కొరతతో ఉంటే.. యంత్రాలను వినియోగించాలన్నారు. చీడ, పీడల నివారణకు డ్రోన్లతో క్రిమి సంహారక మందులను పిచికారీ చేయాలని తెలిపారు. అనంతరం పంట చేలను పరిశీలించారు. కార్యక్రమంలో శాస్త్ర వేత్తలు గిరిరాజ్ అమర్‌నాథ్, డాక్టర్ కేవీరావు, విజయ్ కుమార్, శ్రీకృష్ణ, సుధీర్, చంద్ర కాంత్, మండల వ్యవసాయాధికారి శ్రీలత, ఏఈఓలు లింగ స్వామి, నిఖిత, రైతులు పాల్గొన్నారు.

# రూ.600 కోట్లతో బీటీరోడ్లు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

- ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**ఆమనగల్లు:** కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలో రూ.600 కోట్లతో బీటీరోడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. పురపాలిక సంఘం పరిధిలో అమృత్ 2.0 పథకంలో భాగంగా రూ.32 కోట్లతో వాటర్ ట్యాంకులు, పైప్‌లైన్ నిర్మాణ పనులకు మంగళవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. అభివృద్ధే ధ్యేయంగా రాజకీయాల్లోకి వచ్చానని, ఎమ్మెల్యేగా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో కల్వకుర్తిని ఆదర్శంగా నిలుపుతానని పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో రూ.10 కోట్లతో పనులు చేపట్టామని, మరో రూ.15 కోట్లు మంజూరు చేయాలని సీఎంను కోరామని వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ యాటగీత, పీసీబీ మాజీ సభ్యుడు బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ కిషన్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ కేశవులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడే నర్సింహ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జగన్, పట్టణ అధ్యక్షుడు మానయ్య తదితరులు పాల్గొన్నారు.

**ఆచారి విజ్ఞతకే..**

బీజేపీ నేత ఆచారి సహనం కోల్పోయి సంస్కారం లేకుండా మాట్లాడుతున్నారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తనను ఉద్దేశించి ఇష్టానుసారంగా మాట్లాడారని ఎమ్మెల్యే కసిరెడ్డి ఆరోపించారు. అది ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. ఆమనగల్లులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. చేస్తున్న అభివృద్ధి పనులు ఆచారికి కనబడటం లేదా అని ప్రశ్నించారు. పార్టీలకు అతీతంగా అర్హులకు సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని చెప్పారు. బీజేపీ నేతలు విమర్శలు మానుకొని, అభివృద్ధికి సహకరించాలని కోరారు.